క్లుప్తంగా

కుష్టువ్యాధి నివారణపై అవగాహన



తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని రామచంద్రాపురం వైద్యకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నూతక్కి గ్రామంలోని ప్రజలకు కుష్టువ్యాధి లక్షణాలు గురించి వివరించారు. వ్యాధి ఉన్నవారిని ప్రేమతో ఆదరించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.లక్ష్మీనారాయణ, గ్రేస్ రాబర్ట్, హెల్త్ సూపర్‌వైజర్ కొల్లి శివశంకరరావు, విజయలక్ష్మి, పిఎంఓటీ ఎం.ఆశీర్వాదం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనలో రేవేంద్రపాడు విద్యార్థుల ప్రాజెక్టులు



తాడేపల్లిరూరల్: విజయవాడలో జరుగుతున్న పుస్తక ప్రదర్శనలో సోమవారం రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష స్టేట్ ఒకేషనల్ కో ఆర్డినేటర్ భారతి ఆధ్వర్యంలో తమ పాఠశాల విద్యార్థులు పి.ఝాన్సీ, వి.కాత్యాయనిలు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారని తెలిపారు. విద్యార్థులను, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జాయింట్ కలెక్టర్‌లు అభినందించారని తెలిపారు.

లోక్ అదాలత్‌పై కేఎల్‌యూ విద్యార్థులకు అవగాహన



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూ న్యాయకళాశాల విద్యార్థులకు సోమవారం లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించేందుకు ఏపీ హైకోర్టుకు తీసుకెళ్లినట్లు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ తెలిపారు. మెగా లోక్ అదాలత్ ప్రొసీడింగ్స్‌ను పరిశీలించడానికి, విజయవాడ, గుంటూరు జిల్లా కోర్టులకు వెళ్లినట్లు తెలిపారు. అమరావతి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి లోక్ అదాలత్, శాశ్వత లోక్‌అదాలత్ ప్రక్రియల మధ్య వ్యత్యాసం వంటి వివిధ ఆచరణాత్మక సందేహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల విభాగ అధిపతి విజయ సుధ, ప్రొ.వైస్ చాన్సలర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, అధ్యాపకులు డాక్టర్ శైలజ, ప్రిన్సిపాల్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం



తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని టిడ్కో ఇళ్ల సముదాయంలో అనారోగ్యంతో మృతి చెందిన ఓ మహిళ కుటుంబానికి దహన సంస్కారాల నిమిత్తం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సోమవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆదాం మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో నివాసముండే కంచర్ల అంజమ్మ అనారోగ్యంతో మృతి చెందిందని, ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఎమ్మెల్యే ఆర్కే రూ.5 వేలు ఆమె కుటుంబానికి అందజేసినట్లు తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు అంజమ్మకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, గోవిందు, రాజ్యలక్ష్మి, అన్వర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లు ఆక్రమిస్తే సహించం



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని నవులూరు మక్కెవారి పేటలో సోమవారం కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి సచివాలయ సిబ్బందితో కలసి పర్యటించారు. మక్కెవారిపేటలో ఓ ఇంటి వద్ద వ్యక్తిగత తగాదాలతో మురుగు వెళ్లకుండా అడ్డుకట్ట వేస్తూ నిర్మాణాలు చేపట్టారు. అది గుర్తించిన డీఈ ఇరు వర్గాలను పిలిపించి మంగళవారం ఉదయం 10 గంటలలోపు ఆక్రమణలు తొలగించకపోతే కార్పొరేషన్ ఆధ్వర్యంలో తొలగించి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్షేత్రస్థాయిలో లోపాలు సరిచేయడమే లక్ష్యం

- నేటి నుంచి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ సమావేశాలు
- వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: ఈ నెల 14,15,16,17 తేదీలలో తాడికొండ నియోజకవర్గంలో మండలాల వారీగా నిర్వహించనున్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్ల శిక్షణా సమావేశాన్ని విజయవంతం చేసేందుకు సమష్టిగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ కోరారు. గుంటూరు భారత్‌పేటలోని నియోజకవర్గ కార్యాలయంలో పలువురు నాయకులు, కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలలుగన్న గ్రామ స్వరాజ్యం ప్రతి ఒక్కరికీ చేరువ చేసేందుకు చేస్తున్న కృషిలో భాగమే వలంటీర్లకు అనుసంధానంగా కన్వీనర్లు, గృహ సారథుల ఎంపిక ప్రక్రియ అన్నారు. ప్రతి వలంటీర్ తమ 50 గృహాల పరిధిలోని ప్రతి ఇంటికీ సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులను వెంటబెట్టుకొని వెళ్లి సమస్యలు తెలుసుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో లోపాలుంటే వెంటనే సరిచేయవచ్చన్నారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయని సాహసోపేతమైన నిర్ణయాలతో ఏపీలో అభివృద్ధి, సంక్షేమం పేదల ఇంటికి చేరుతుందని, కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించేందుకు నూతనంగా ఎంపికైన గృహ సారథులు, కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు తుళ్లూరులోని జమ్ముల సాంబయ్య కల్యాణ మండపంలో తుళ్లూరు మండల కార్యకర్తల సమావేశం జరగనుందని, 15న తాడికొండ సాయిబాబా ఆలయ కల్యాణ మండపం, 16న మేడికొండూరు, 17న ఫిరంగిపురం మండలాల కన్వీనర్‌ల సమావేశం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జగనన్న ఆశయ సాధనకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ విష్ణు జూనియర్ కళాశాల వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ విష్ణు జూనియర్ కళాశాల 5వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ టి.మనోజ్‌కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా కృష్ణబలిజ సంఘం కార్పొరేషన్ చైర్మన్ కోలా భవానీ విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ శ్రీ విష్ణు జూనియర్ కళాశాల స్థాపించిన నాటి నుంచే రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధిస్తున్నదని, ఐఐటీ పరీక్షల్లో ప్రతి సంవత్సరం 40శాతం ర్యాంకులు సాధించడం కళాశాలలో అధ్యాపకుల పనితీరుకు నిదర్శనమని అన్నారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు వేదా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ పాశం వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు. వీజెపి, డీఎల్‌బీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డోగిపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ విష్ణు కళాశాలతోపాటు తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి, పెదకాకాని పరిసర ప్రాంతాల్లో పేద మధ్య తరగతి విద్యార్థుల కోసం మొదటిసారిగా ఎంఎల్‌టీ, ఒకేషనల్ కళాశాల, నిర్మల కళాశాల, శ్రీ బాలాజీ జూనియర్ కళాశాలలు స్థాపించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ వి.వెంకటేశ్వరరావు, మంగళగిరి 1వ వార్డు మాజీ కౌన్సిలర్ వీసం జవహర్‌లాల్, శ్రీ విష్ణు కళాశాల డైరెక్టర్, ఏపీజెఎంఎ రాష్ట్ర అధ్యక్షుడు వీసం వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫైన్ ఆర్ట్స్ అధ్యాపకుడికి 'కళారత్న' పురస్కారం



జాన్ రత్నబాబును సన్మానిస్తున్న వీసీ

ఏఎన్‌యూ: నాగార్జున యూనివర్సిటీ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు జాన్ రత్నబాబుకు 'కళారత్న' పురస్కారం లభించింది. ఆయన్ను సోమవారం యూనివర్సిటీలో వీసీ ఆచార్య పి. రాజశేఖర్ సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌కి చెందిన కళారత్నం ఫౌండేషన్ ఆఫ్ ఆర్ట్ సొసైటీ గత ఏడాది డిసెంబరు 10, 11 తేదీల్లో వార్షిక ఆర్ట్ కాంటెస్ట్ నిర్వహించిందని తెలిపారు. ఇందులో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచి ఐదువేల మంది కళాకారులు పలు విభాగాల్లో చిత్రాల్ని పోటీలకు పంపగా తాను పంపిన చిత్రం ఎంపికైందని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి. కరుణ, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఈ. శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు నిరుపమ, ఫైన్ ఆర్ట్స్ విభాగ కో–ఆర్డినేటర్ శేఖర్‌బాబు, అధ్యాపకుడు దేవకాంత్ పాల్గొన్నారు.

కేఎల్‌యూలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్



విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో సోమవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌పై సక్సెస్ మీట్ నిర్వహించారు. ఉద్యోగాల కల్పన డీన్ డాక్టర్ ఎస్.బి.వి.కె. ప్రసాద్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో నమోదు చేసుకున్న విద్యార్థులందరూ ఉద్యోగాలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ ఏడాది మొత్తం 79 మంది విద్యార్థులు మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో నమోదు చేసుకున్న వారందరూ ఉద్యోగ నియామక పత్రాలు అందుకోవడం వెనుక విశ్వవిద్యాలయాల అధ్యాపకుల కృషి ఎంతో ఉందని అన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, మెకానికల్ విభాగ అధిపతి తదితరులు పాల్గొన్నారు.

ఏపీని వెట్టి చాకిరీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం

ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కె.అప్పారావు

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి బాలల జీవితాల్లో వెలుగులు నింపాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కె.అప్పారావు అన్నారు. సోమవారం నగర పాలక సంస్థ పరిధిలోని నవజీవన్ ఆధ్వర్యాన చిగురు ఆశ్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులతో కలసి ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఏపీ సీఐడీ వారు ప్రారంభించిన ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జిల్లాస్థాయి అధికారుల బాలకార్మికులు, వెట్టి చాకిరీ చేస్తున్న బాలలను గుర్తించి విముక్త పరచి వారిని తిరిగి పాఠశాలల్లో లేదా బాలల పునరావాస కేంద్రాల్లో ప్రవేశం కల్పించేలా చర్యలను తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి అధ్యక్షురాలు ప్రమీల, సభ్యురాలు రత్నకుమారి, డీపీఓ సత్యనారాయణ, బచపన్ బచావో ఆందోళన రాష్ట్ర సమితి నాయకులు జి.తిరుపతిరావు, జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధులు అనిల్, విజయ్‌కుమార్, చిగురు సిబ్బంది అనిల్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరోజని నాయుడు జయంతి వేడుకలు



సరోజని నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): స్వాతంత్ర్య సమరయోధురాలు, మహిళాభ్యుదవాది సరోజనీ నాయుడు జయంతి వేడుకలను దుగ్గిరాల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు సరోజనీనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి, పౌర హక్కులు, మహిళా విముక్తి కోసం కృషిచేసిన గొప్ప దార్శనికురాలు సరోజనీ నాయుడు అని అన్నారు. సరోజనీ నాయుడు చిన్నప్పటి నుంచి చదువుపట్ల ఆసక్తిని పెంచుకుని 12వ యేటనే కవిత్వం, రచనలు చేయడం మొదలు పెట్టారని, 1906లో మహిళలకు విద్య అవసరమని భావించి దేశవ్యాప్తంగా అనేక సమావేశాలు నిర్వహించి మహిళల్లో చైతన్యం తీసుకు వచ్చారని అన్నారు. సరోజనీనాయుడు గౌరవార్థం ఆమె జన్మదినాన్ని జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి, అసోసియేషన్ సభ్యులు నల్లనూకల వెంకటేశ్వరరావు, కుర్ర నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణం

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం శాంతికల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు చిట్టా వెంకటేశ్వరరెడ్డి, చిట్టా సుబ్బారెడ్డిలు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహారాధన, శాంతికల్యాణం వేదపండితులు విశ్వనాథశాస్త్రి, నారాయణం వంశీకృష్ణలు నిర్వహిస్తారన్నారు.

కొత్త బోరు ఏర్పాటు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరం ఎస్సీ కాలనీలో తాగునీటిని అందించేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొత్త బోరు నిర్మాణ పనులను సోమవారం చేపట్టారు. రాబోయే వేసవికాలంలో వడ్డేశ్వరం ఎస్సీ కాలనీలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు కొత్తగా పైపులైను ఏర్పాటు చేశామని, ఆ ప్రాంతానికి తాగునీరు అందించేందుకు బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున బోరు ఏర్పాటు చేసి విద్యుత్ మోటర్లు పెట్టి ప్రతి రోజూ పంపింగ్ ద్వారా నీటిని అందించనున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

తాడేపల్లిరూరల్: మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళగిరి సమగ్ర శిశు అభివృద్ధి పథకపు అధికారి ఎస్కై నూరాని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి 2 (కోడ్ నెం. 0710058) సహాయకురాలిగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థిని తప్పని సరిగా 7వ తరగతి ఉత్తీర్ణురాలై ఉండాలని, 21 నుంచి 35 ఏళ్లలోపు వారై ఉండాలని, అభ్యర్థిని తప్పని సరిగా వివాహితురాలై ఉండి, స్థానికురాలై ఉండాలని, ఎస్సీ, ఎస్టీలలో 21 ఏళ్లు నిండిన వారు లేకుంటే 18 ఏళ్లు నిండిన వారిని పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు మంగళగిరిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మేడికొండూరు: మండలంలోని సిరిపురం గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధానంగా రబీ సీజన్‌లో సాగు చేసే పంటలలో నవ ధాన్యాలు ఆర్‌డియస్ 30 రకాలు వేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ పీఆర్పీ రామకృష్ణ తెలిపారు. పెట్టుబడి తక్కువ.. రైతులకు ఆదాయం ఎక్కువ ఈ విధానంతో దరిచేరుతుందని తెలిపారు. సాధారణ వ్యవసాయ సాగు పంటలలో పురుగుమందులు విరివిగా వాడటం వల్ల పెట్టుబడి ఎక్కువగా పెట్టాల్సిన పరిస్థితి ఉంటుందని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ప్లకార్డులు చేపట్టి గ్రామంలో ప్రత్యేక ర్యాలీని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది తిరుపతి రావు, మేరి, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనారసింహుని కల్యాణం



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలోని శ్రీలక్ష్మీనారసింహస్వామి ఆలయ ద్వితీయ వార్షిక కల్యాణోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామివార్లకు ఉదయాన్నే వేదపండితులు బి.అనంతాచార్యులు, కేశవాచార్యులు, పవన్‌కుమార్‌లు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. మండపంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, నవగ్రహపూజ, రక్షాబంధనం, వధూవరులపూజలు చేసి శాంతికల్యాణం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన యాగశాలలో సుదర్శనహోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ట్రస్టీ మానుకొండ వెంకటసుబ్బారెడ్డి, వెంకటరమణలు పర్యవేక్షించారు.

శ్మశానవాటికల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

మేయర్ కావటి



శ్మశానవాటికలో పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: నగర శ్మశానవాటికల్లో మౌలిక వసతుల కల్పనకు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఇందులో స్వచ్ఛంద సంస్థల్ని కూడా భాగస్వామం చేస్తామని మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు తెలిపారు. నగరంలోని శ్రీనివాసరావుతోటలోని హిందూ శ్మశానవాటికను కైలాసభూమి మొదటి ఫేస్ కింద రూ. 2.70 కోట్లతో గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో, స్థానిక పెద్దల సహకారంతో అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని శ్మశానాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. నగరంలోని శ్రీనివాసరావుతోట శ్మశాన వాటికను సుమారు 8 డివిజన్లలోని లక్ష మంది దాకా వినియోగిస్తున్నారన్నారు. ఇందులో గ్రీనరీతో పాటు పెదకర్మ, ఇతర కార్యక్రమాలు నిర్వహణ, కొన్ని రోజుల పాటు అక్కడే ఉండే నిమిత్తం గదులు, భోజన, వంటశాలలు, కేశఖండనం, స్నానపు గదులు, అస్థికలు భద్రపరచే గదులు, శ్మశానవాటిక బయట రోడ్డు విస్తరణ, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. పార్థివదేహాల్ని భద్రపరిచేందుకు ప్రత్యేకంగా ఐస్ మార్చురీ గదులు, ఇతర బాక్సులు, పలు దేవతామూర్తుల విగ్రహాల్ని కూడా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నగరంలోని శ్మశానాల్ని అభివృద్ధి చేయడానికి స్వచ్ఛంద సేవా సంస్థల సహాయ, సహకారాలు కూడా తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, గేదెల నాగ రంగమణి, సాదు ఉమామహేశ్వరి, కాంద్రుకుంట గురవయ్య, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, రమేష్, రాజేష్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు రమేష్, రమణబాబు, నగరపాలక సంస్థ డీఈఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు నిర్దేశిత గడువులోగా పరిష్కారం

నగర కమిషనర్ కీర్తి చేకూరి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ప్రజల నుంచి సమస్యలపై అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం స్పందన నిర్వహించారు. తొలుత గత వారం ఫిర్యాదుల పరిష్కారం, స్పందన పోర్టల్, ఈఆర్‌పీ, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో, సంబంధిత కార్యదర్శులతో సమీక్షించారు. ప్రజల సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదుదారుడికి సమాచారం తెలియజేయాలని చెప్పారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫోటోలు జత చేయాలని సూచించారు. సచివాలయ కార్యదర్శుల పనితీరు, సేవలు, స్థానిక సమస్యలపై నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని కమిషనర్ చెప్పారు. ప్రతి సోమవారం సచివాలయ పనితీరుపై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ప్రతి రోజూ వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ అందుబాటులో ఉండాలని ఆమె తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 42 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి –19, ఇంజినీరింగ్ విభాగానికి– 6, ప్రజారోగ్య విభాగానికి– 7, రెవెన్యూ విభాగానికి –5, ఉపా సెల్ విభాగానికి సంబధించి– 3, అకౌంట్స్ విభాగానికి సంబంధించి– 2 చొప్పున ఫిర్యాదులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ మూర్తి, డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, సీఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఆర్ఓలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

సాధికారతతోనే మహిళల సమస్యలకు పరిష్కారం

వీసీ ఆచార్య పి.రాజశేఖర్



సమావేశంలో ప్రసంగిస్తున్న రాజశేఖర్

ఏఎన్‌యూ: మహిళల పరిపూర్ణ సాధికారతే వారు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు పరిష్కారమని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'వైలెన్స్ యాస్ ఇంప్లిమెంట్ టూ ఉమెన్ ఎంపవర్‌మెంట్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును సోమవారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింసలపై పలు ఉద్యమాలు జరుగుతున్నా, మహిళా సాధికారతపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రిజిస్ట్రార్ బి. కరుణ మాట్లాడుతూ మహిళలపై నేటికీ హింసలు పలు రూపాల్లో ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెక్టార్ పి. వరప్రసాదమూర్తి ప్రసంగిస్తూ మహిళలపై జరుగుతున్న హింస నియంత్రణ, సాధికారత పెంపునకు పరిష్కార మార్గాలు చూపడానికి ఈ సదస్సు దోహదం చేస్తుందని తెలిపారు. ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సరీస్ డీన్ చైతన్య కుమారి ప్రసంగిస్తూ మహిళలపై హింసకు ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని తెలిపారు. హైదరాబాద్ జాతీయ మహిళా అధ్యయన కేంద్రం అధ్యాపకులు షీలా నారాయణ్ ప్రసంగిస్తూ ప్రతి ఏడాది ఎంతో మంది మహిళలకు పలు రకాల హింసలకు గురవుతున్నారన్నారు. మహిళలు విద్యావంతులవ్వడం ద్వారానే అవరోధాల్ని అధిగమించవచ్చని సూచించారు. ఏపీ హైకోర్టు న్యాయవాది నీరు మిశ్రా, విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ప్రభాకర్ ఆకురాతి ప్రసంగించారు. డైరెక్టర్ డాక్టర్ కె.వి.శాంతిశ్రీ సదస్సులో చర్చిస్తున్న అంశాల్ని వివరించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్గాలో భక్తిశ్రద్ధలతో చంద్రమాన ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న పీఠాధిపతులు

లక్ష్మీపురం: నల్లచెరువు ఎత్తురోడ్డు సెంటర్‌లోని హజ్రత్ మొహీయుద్దీన్ పాలెంలోని మహబూబ్ సుభాని 17వ మనువలు హజ్రత్ సయ్యద్ షా మొహీయుద్దీన్ బాద్‌షా ఖాదిరి దర్గా ప్రాంగణంలో చంద్రమాన 21వ రోజు, స్వర్గీయ హజ్రత్ నూరుల్ ముస్తఫా ఖాదిరి జన్మదిన వేడుకల్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా దర్గా ప్రాంగణంలోని బాబా సమాధిని పూలతో అలంకరించి, ధూప, దీపాలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సయ్యద్ షా సులేమాన్ అల్ హసనీ ఉల్ హుసైనీ ఖాదిరి మాట్లాడుతూ నెలలో ప్రతి గురువారం, ప్రతి నెల చంద్రమాన 21వ రోజు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. వచ్చే నెల 13వ తేదీ నుంచి దర్గాలో ఉరుసు మహోత్సవ వేడుకల్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉరుసు మహోత్సవంలో మొక్కులను తీర్చుకునేందుకు భక్తులు ముందుగానే దర్గా పీఠాధిపతులకు సమాచారం అందించాల్సిందిగా కోరారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బాబా మురీదులు, స్థానికులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న ఇద్దరిపైకేసు నమోదు

గుంటూరు ఈస్ట్: సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న ఇద్దరిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శారదా కాలనీ ఆర్చి సమీపంలో కొందరు సింగిల్ నంబరు ఆట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం దాడి చేశారు. కడియం విజయకుమార్, నరసింహారావును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 2,900 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.